# పరకాల సమస్యలపై సీఎం ఎదుట ఎమ్మెల్యే ఎందుకు మౌనం?

**భారతీయ జనతా పార్టీ హనుమకొండ జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి దేవునూరి మేఘనాథ్**

**పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి:**



ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పరకాల పర్యటన సందర్భంగా బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయించి, పరకాల ప్రజల చిరకాల సమస్యలు, ఆకాంక్షలను సీఎం దృష్టికి తీసుకెళ్లకుండా చేయడంపై ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని బీజేపీ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవునూరి మేఘనాథ్ తీవ్రంగా ప్రశ్నించారు. అరెస్టులు చేయించడం కాకుండా ప్రజల తరఫున సీఎం వద్ద సమస్యలను ప్రస్తావించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందన్నారు.పరకాలను అమరవీరుల జిల్లాగా ఏర్పాటు చేయాలి అనే ప్రజల డిమాండ్‌ను సీఎం దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని ప్రశ్నించారు. పరకాలకు నష్ట నివారణ చర్యల్లో భాగంగా మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేయాలని ఎందుకు కోరలేదన్నారు. నడికుడ మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు గడిచినా పోలీస్‌స్టేషన్ లేకపోవడంపై కూడా సీఎం వద్ద ప్రస్తావించకపోవడం బాధాకరమన్నారు.కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ కోసం భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు నష్టపరిహారం, ఉద్యోగ కల్పన వంటి అంశాలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ తీసుకురావాలని డిమాండ్ చేశారు. గతంలో శంకుస్థాపన చేసిన ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు మళ్లీ శంకుస్థాపన చేయడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని, ప్రజలను తప్పుదోవ పట్టించవద్దన్నారు.100 పడకల ఆసుపత్రిలో పూర్తి సౌకర్యాలున్నాయా? వైద్యులు, సిబ్బంది, పరికరాలు అందుబాటులో ఉన్నాయా అనే విషయాలను ఎమ్మెల్యే ప్రజలకు వెల్లడించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వం చేసినట్లుగా ప్రచారం చేయడం సరికాదన్నారు. బీజేపీ నాయకులను అరెస్టు చేయించడం ద్వారా ప్రజల గొంతును అణచివేయలేరని, పరకాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో మరింత ఉధృతంగా పోరాటం కొనసాగిస్తామని దేవునూరి మేఘనాథ్ స్పష్టం చేశారు.